# అశ్రిత

## ఎక్సెలెన్స్ ఇన్ సోషల్ డెవలప్మెంట్

అందమైన బాల్యం శాపంగా మారితే భవిష్యత్ అంధకారం అవుతుంది. నా అన్నవారు లేక ఆకలికి అలమటిస్తూ...ఎండకు ఎండుతూ...వానకు తడుస్తూ రోడ్లపై తిరిగే పిల్లలు అక్కడక్కడా కనిపిస్తారు. ఇంటినుంచి పారిపోయివచ్చి ఎక్కడికెళ్లాలో తెలియక బిక్కుబిక్కుమంటూ రైల్వే స్టేషన్లలో, బస్ స్టేషన్‌లలో తిరిగే పిల్లలు ఎంతోమందున్నారు. ఇలాంటివారిని చేరదీసి..ఆశ్రయం కల్పించి.. విద్యాబుద్ధులు నేర్పిస్తోంది ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ. చిన్నతనంలోనే కఠినమైన పరిస్థితుల కారణంగా మానసికంగా దెబ్బతిన్న బాలబాలికలకు కౌన్సిలింగ్ చేసి మేమున్నామనే ధైర్యాన్ని కల్పిస్తోంది ఆశ్రిత. ఇంటినుంచి పారిపోయినవారు, తప్పిపోయిన చిన్నారుల సమాచారం సేకరించి వారిని తల్లిదండ్రుల వద్దకు చేర్చడం ఈ సంస్థ ప్రధమ కర్తవ్యం. ఈ విధంగా ఇప్పటివరకు సుమారు 65 మంది పిల్లలను వారి కుటుంబ సభ్యుల వద్దకు చేర్చారు. వారంతా ఇప్పుడు తల్లిదండ్రులతో కలిసి సంతోషంగా ఉన్నారు. మరోవైపు సమాజం చేత తిరస్కరించబడినవారు, భిక్షాటన చేసుకుని జీవించే అభాగ్యులు, చిత్తుకాగితాలు ఏరుకునే చిన్నారులు, అమ్మానాన్నలు ఉండికూడా ఏ రక్షణా లేని బాలబాలికలకు అండగా నిలుస్తోంది ఆశ్రిత. విద్యతో పాటు ఆటపాటల్లోనూ ఈ పిల్లలను తీర్చిదిద్దుతున్నారు. పెద్దయ్యాక సమాజంలో ఎదురయ్యే సమస్యలను, సవాళ్లను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవడానికి అవసరమైన నైపుణ్యాలను కూడా నేర్పిస్తున్నారు. ప్రస్తుతం రేయిన్‌బో హోమ్ పేరుతో నిర్వహిస్తున్న ఆశ్రమంలో 100 మంది బాలికలు, స్నేహ ఘర్‌లో 55 మంది బాలలు ఉన్నారు. బాలల హక్కులను పరిరక్షించి వారి బంగారు భవిష్యత్‌కు పునాదులు వెయ్యాలనేది తమ సంస్థ ఆశయం అంటారు ఆశ్రిత

ఫౌండర్ సెక్రటరి నాగరాజు. వివిధ ప్రభుత్వ విభాగాలు, ప్రైవేటు సంస్థలు, పోలీసుల సహకారంతో నిర్వహిస్తున్న ఆశ్రిత స్వచ్ఛంద సంస్థకు 2017 సంవత్సరానికిగాను సోషల్ డెవలప్‌మెంట్ విభాగంలో సాక్షి ఎక్స్‌లెన్స్ అవార్డుతో సత్కరిస్తోంది సాక్షి మీడియా.